అతిథి లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అల్లాపూర్, 31 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి కాలేజీ ప్రిన్సిపాల్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇంగ్లీష్, మ్యాథమాటిక్స్, తెలుగు, హిస్టరీ, కామర్స్ మరియు కంప్యూటర్ సైన్స్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్.అలివేలు మంగమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, అదే రోజున ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను ప్రిన్సిపాల్‌కు అందజేయాలని తెలిపారు.

హెచ్‌ఏఎల్ ఎన్నికల్లో హెచ్‌ఏడబ్ల్యూ విజయం


కార్మికులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న నూతన అధ్యక్షుడు వెంకటాద్రి, హెచ్‌ఏడబ్ల్యూ నేతలు

బాలానగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లో ఉన్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)లో జరిగిన కార్మిక యూనియన్ ఎన్నికల్లో హెచ్‌ఏడబ్ల్యూ యూనియన్ ఘనవిజయం సాధించింది. తన ప్రత్యర్థి బీఎంఎస్‌పై 17 ఓట్ల మెజారిటీతో గెలిచింది. మొత్తం 890 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా పోలింగ్ రోజు 825 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 51 పోస్టల్ రాగా 11 ఓట్లు చెల్లుబాటు కాలేదు. సంస్థలో ఉన్న 6 యూనియన్లలో 4 యూనియన్లు కూటమిగా ఏర్పడి కూటమి అభ్యర్థిగా హెచ్‌ఏడబ్ల్యూ అధ్యక్షుడు వెంకటాద్రినికి బరిలో దించితే బీఎంఎస్, బీఆర్ఎస్ యూనియన్‌లు పొత్తు పెట్టుకుని తమ అభ్యర్థిగా బీఎంఎస్‌కు చెందిన జానకీరామ్‌ను పోటీలో నిలిపారు. కార్యక్రమంలో గణేష్, సబ్గతుల్లా, ప్రవీణ్, చందర్‌రావునాయక్, సురేశ్, రాంచందర్, వెంకటపతి, అన్వర్, భాగ్య, జాహ్నవి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తగ్గించొద్దు

దుండిగల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 65 ఏళ్లు నిండిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తగ్గించి ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం మానుకోవాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని సీఐటీయూ హెచ్చరించింది. శనివారం మేడ్చల్ జిల్లాలోని అంగన్వాడీ స్కూల్స్ వద్ద రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చే విషయమై అంగన్వాడీ కార్మికులు సీఐటీయూ నాయకుల మద్దతుతో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి రాధ మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా అంగన్వాడీ ఉద్యోగులు సేవలందిస్తున్నారని, వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సగానికి తగ్గించి ఇవ్వాలనే జీవో విడుదల చేయడం దారుణమన్నారు. పాత జీవో ప్రకారం టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.1 లక్ష బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుండా సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ నిరసనలో అనిత, పార్వతి, సుకన్య, భాగ్యలక్ష్మి, శోభారాణి, మీన, నాగమణిలతో పాటు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


ఫతేనగర్ ఎస్టీపీ ప్లాంట్ వద్ద పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఫతేనగర్ ఎస్టీపీ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభిస్తాం

ఫతేనగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ ఎల్‌బీఎస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్టీపీ (సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణ పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీనీరు నేరుగా చెరువుల్లోకి చేరకుండా ఎస్టీపీ ప్లాంట్ల ద్వారా శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రూ.325 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 9 చెరువుల వద్ద ఎస్టీపీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగానే ఫతేనగర్‌లో 133 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ ప్లాంట్‌ను నిర్మించినట్లు ఎమ్మెల్యే వివరించారు. ప్లాంట్ నిర్మాణం దాదాపు పూర్తయిందని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, అధికారులు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

క్రీడలు యువతలో పోరాటాన్ని పెంపొందిస్తాయి


రవీందర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

బాలానగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలు యువతీ యువకుల్లో పోరాట పటిమను పెంపొందిస్తాయని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి యువతకు సూచించారు. శనివారం ఉదయం బాలానగర్ రాజూ కాలనీ కమ్యూనిటీ హాలులో రెండు రోజుల పాటు నిర్వహించే తెలంగాణ స్టేట్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్, నేషనల్ పవర్ లిఫ్టర్ పి.రమేష్‌బాబు, జైహనుమాన్ వ్యాయామశాల సభ్యులు కేఎస్ఎన్. రెడ్డి, ఖాజ, జెర్రిపోతుల రవీందర్, రత్నం, నర్రా దేవేందర్, రంగంపేట శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

8వ బెటాలియన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం


వివరణ ఉద్యోగులతో కమాండెంట్ సన్ని

గచ్చిబౌలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో ఉద్యోగ విరమణ చేసిన వారిని బెటాలియన్ కమాండెంట్ సన్ని ఘనంగా శనివారం సన్మానించారు. ఏఆర్ఎస్సైలు మున్నీర్‌ఖాన్, వైపీఎస్ సద్గురవయ్య, హెచ్‌సీ జి.అరవిందరెడ్డి, కుక్ సయ్యద్ ఖాసీంను కమాండెంట్ సన్మానించారు. భవిష్యత్‌లో ఎలాంటి సహాయసహకారాలు అయిన అందిస్తామన్నారు. బెటాలియిన్ సిబ్బంది పాల్గొన్నారు.

భవానీనగర్ అమ్మవారికి కార్పొరేటర్ పూజలు

ఓల్డుబోయినపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు సోకే ప్రమాదం ఉందని అందుకే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మయాదవ్ డివిజన్ ప్రజలకు సూచించారు. శనివారం భవానీనగర్ అమ్మవారి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు కార్పొరేటర్‌ను సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కర్రె జంగయ్య, ఉదయ్‌యాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

క్రీడల్లో భవన్స్ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

భెల్‌కాలనీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల భారతీయ విద్యాభవన్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభను కనపరుస్తూ జ్ఞాపికలను కైవసం చేసుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో పాఠశాలకు చెందిన ఆలియాఫాతిమా, దివ్యస్నేహిత, శుభాంగ్, వజ్రచౌదరిలు వివిధ పోటీల్లో సత్తాచాటి జాపికను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, హెడ్ మిసెసస్ భాను సన్మానించారు.

సబితాఇంద్రారెడ్డిని కలిసిన సాయిబాబా


సబితాఇంద్రారెడ్డిని కలిసిన సాయిబాబా

రాయదుర్గం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సబితాఇంద్రారెడ్డి సూచించినట్లు సాయిబాబా తెలిపారు.

హైదర్‌నగర్‌లో భారీ వర్షం

జలమయమైన రహదారులు


హైదర్‌నగర్ హెచ్‌ఎంటీహిల్స్ కాలనీలో పొంగుతున్న మ్యాన్‌హోల్


కూకట్‌పల్లి ఉషా ముళ్లపూడి రోడ్డులో కురుస్తున్న వర్షం

హైదర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్‌లో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తడిసిముద్దయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ జాంలతో వాహనదారులు అవస్థలు పడ్డారు. వర్షం నీరు రోడ్లపై చేరడంతో అవి చెరువులను తలపించాయి. రోడ్లపై నీరు నిలవడంతో పెద్ద పెద్ద గుంతల్లో నీరు చేరడంతో రహదారులు అస్తవ్యస్తమయ్యాయి. ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి'

హైదర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బాగ్ అమీర్ గ్రామ ప్రభుత్వ సర్వేనెంబర్ 70లోని 201 గజాల ప్రభుత్వ (శ్మశానవాటిక) స్థలాన్ని నిఖిలేశ్వర బిల్డర్స్ యజమానులు కబ్జా చేశారని శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు ప్రజాశక్తి సోషల్ ఆర్గనైజేషన్ సభ్యుడు ఏకాంత్ గౌడ్ శనివారం కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వివేకానందనగర్ ఏఎస్‌రాజునగర్‌లో కూకట్‌పల్లి సర్వేనెంబర్ 166 ప్లాట్‌నెంబర్ 83 లేఔట్ ప్రకారం 599 గజాలుకాగా ప్రభుత్వ స్థలం 201 గజాలు కలుపుకుని కొంతమంది రెవెన్యూ అధికారుల సహకారంతో యుఎల్‌సీ పొంది జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు తీసుకున్నారని వినతిపత్రంలో వివరించారు. దీనిపై స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ అభ్యర్థులకు

ముగిసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఇంటర్వ్యూల నిర్వహణపై కొనసాగుతున్న సస్పెన్స్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం ఎట్టకేలకు పూర్తయింది. మొత్తం 324 మంది అభ్యర్థులు ప్రవేశపరీక్షలో అర్హత సాధించగా, ధ్రువపత్రాల పరిశీలనకు కేవలం 220 మందే హాజరైనట్లు తెలిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్ట్‌టైమ్ అభ్యర్థులు.. తాము పని చేస్తున్న సంస్థలో జాయినింగ్ తేదీ నుంచి జీతాల స్లిప్పులు తీసుకురావాలంటూ అధికారులు పెట్టిన నిబంధన పలువురు అభ్యర్థులకు ఆగ్రహం తెప్పించింది. అభ్యర్థుల ఆగ్రహంతో అధికారులు వెనక్కి తగ్గి కనీసం ఆరు నెలల పేస్లిప్పులు సబ్‌మిట్ చేయాలని నిబంధనలను సడలించారు. ఇదిలా ఉంటే, జేఎన్‌టీయూలో కాంట్రాక్టు అధ్యాపకులకు వర్సిటీ యజమాన్యమే ప్రతినెలా జీతాల స్లిప్పులు జారీ చేయడం లేదు. దీంతో పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా, తాము నిరభ్యంతర పత్రం మాత్రమే జారీ చేస్తామని స్పష్టం చేశారు. మరోవైపు వేతన స్లిప్పులు తీసుకురాని కారణంగా కాంట్రాక్టు అధ్యాపకుల వెరిఫికేషన్‌ను అడ్మిషన్ విభాగం అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించే అంశం సస్పెన్స్‌లో పడింది. ఈ విషయమై వైస్‌చాన్స్‌లర్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని, ఆయన ప్రస్తుతం ఇతర బాధ్యతల్లో బిజీగా ఉన్నందున ఇప్పట్లో ఇంటర్వ్యూల అంశం కొలిక్కి వచ్చే అవకాశం లేదని అడ్మిషన్ల విభాగం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపీ కొండా


విశ్వేశ్వరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మిత్రహిల్స్‌వాసులు

హైదర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, హైదర్‌నగర్ డివిజన్ కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్‌బెస్టాజ్ కాలనీలో మంజీర వాటర్‌బిల్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేకానీ ఎమ్మెల్యే అధికారులు సమస్యను పరిష్కరించకుండా చోద్యం చూస్తున్నారన్నారు. అదేవిధంగా హైదర్‌నగర్ మిత్రహిల్స్ పార్కు నిరుపయోగంగా ఉన్న పార్కును ప్రజాప్రయోజనాల కోసం వాడకలోకి తీసుకురావడానికి హెచ్‌ఎండీఏ అధికారులతో మాట్లాడి పార్కు అభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అధ్యక్షుడు, స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నల్లగండ్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లూమ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలను శనివారం ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలన్నారు.

రీ బిగ్‌గ్రీన్ గణేశ్ వేడుకలు ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న హీరో సుధీర్‌బాబు, నిర్వాహకులు

రాయదుర్గం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మనమందరం బాగుండాలి.. ప్రకృతి బాగుండాలని కోరుకుంటూ వినాయకుడికి పూజలు చేస్తాం. అలాంటి పూజలు మట్టి వినాయకుడికి చేస్తే పర్యావరణాన్ని కాపాడుతూ మనం బాగుంటామని హీరో సుధీర్‌బాబు అన్నారు. రాయదుర్గం నాలెడ్జ్‌సిటీలోని రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ 92.7 బిగ్ ఎఫ్‌ఎంతో భాగస్వామ్యంతో రీబిగ్ గ్రీన్ గణేశ్ 17వ ఎడిషన్‌ను శనివారం తమ కార్యాలయంలో ప్రారంభించింది. రీబిగ్ గ్రీన్ గణేశ్ కార్యక్రమంలో భాగంగా విత్తనాలతో కూడిన 15 వేల మట్టి గణేశులను దేశవ్యాప్తంగా పంపిణీ కార్యక్రమానికి సుధీర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తమ కుటుంబ సభ్యులందరం మట్టి వినాయకుడికి పూజలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. విత్తన గణేశ్ విగ్రహాలను పూజించిన అనంతరం నిమజ్జనం చేయడం వల్ల అందులో ఉన్న విత్తనాలు మొక్కలుగా మారి పర్యావరణాన్ని పరిరక్షిస్తాయనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రీ సస్టెయినబిలిటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌతం రెడ్డి, సీఈవో మసూద్‌మల్లిక్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని తాము 17 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణం కాపాడిన వారమవుతామన్నారు.

నిమజ్జనం ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, అధికారులు

చందానగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని చందానగర్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో పరిధిలోని అంబేడ్కర్ కల్యాణ మండపంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీస్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందుల పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మంచినీటి సరఫరా, విద్యుత్ దీపాలు, నిమజ్జన కొలన్‌లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఏపీహెచ్‌పీ కాలనీలోని అమ్మవారి దేవాలయ ఆలయ ప్రాంగణంలో నూతనంగా చేపట్టనున్న అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి గురుస్వామి శనివారం భూమిపూజ చేశారు. ఈ ఆలయాన్ని రూ.25 లక్షలతో చేపట్టనున్నట్లు కాలనీవాసులు శ్రీనివాస్‌రెడ్డి, అంజనేయులు, రామ్‌రెడ్డి, రామచంద్రరావు,సాయికిరణ్, సోమాజీ, సాయిబాబా, ఎం శ్రీనివాస్ రెడ్డి, రంగారావు తెలిపారు.

'ప్రజల సమస్యలను పరిష్కరిస్తా'

షాపూర్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను నియోజకవర్గానికి చెందిన పలు కాలనీల నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు శనివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నిర్వహించనున్న 5వ రాష్ట్ర మహాసభలకు హాజరుకావాలని ఆ సంఘం సభ్యులు ఆయనను కోరారు. ప్రజల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని శ్రీశైలంగౌడ్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం: డీసీ

చందానగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చందానగర్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. మాదాపూర్ అయ్యప్పసొసైటీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను శనివారం కూల్చివేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. అని అనుమతులు తీసుకున్న తరువాతే నిర్మాణాలు చేసుకోవాలని తెలిపారు.

రెహ్మాత్‌నగర్‌లో

రోడ్డు విస్తరణ ఎప్పుడో?


రెహ్మాత్‌నగర్ పీజేఆర్ మలుపు వద్ద..

- దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ట్రాఫిక్ సమస్య
- రద్దీ వేళల్లో భారీగా రోడ్లపై నిలుస్తున్న వాహనాలు

ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా దశాబ్దాలుగా రెహ్మాత్‌నగర్ డివిజన్‌లోని రెండు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి మోతీనగర్ చౌరస్తా వరకు రోడ్డును ఉన్నతాధికారులు పరిశీలించి వెళ్లినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. రద్దీవేళల్లో ఈ మార్గం నుంచి వెళ్లే వాహనదారులు నరకం చూస్తున్నారు.

యూసుఫ్‌గూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాహనాల రద్దీ దృష్ట్యా యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి మోతీనగర్ వరకు రోడ్డును విశాలంగా మార్చాలని సంవత్సరాల క్రితం అధికారులు ప్రణాళిక రూపొందించారు. అనేక ఆటంకాలు వచ్చినా దాదాపుగా పనులు సాగాయి. కేవలం రెహ్మాత్‌నగర్ నిమ్స్‌మే నుంచి మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు, నిమ్స్‌మే గ్రౌండ్ నుంచి శ్రీరామ్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ జరగలేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ అధికారులకు కంఠకంగా మారింది.


ఒకే మార్గంలో రాకపోకల వల్ల ట్రాఫిక్‌జామ్

ఇరుగ్గా రెహ్మాత్‌నగర్ మలుపు

వేలాదిగా భారీ వాహనాలు ప్రయాణించే రెహ్మాత్‌నగర్ చౌరస్తా వద్ద పీజేఆర్ మలుపు చాలా ఇరుగ్గా ఉంది. ఇక్కడ ఒక వాహనం మళ్లడమే కష్టం. ఎదురుగా మరో వాహనం వస్తే ట్రాఫిక్ నిలిచిపోతుంది.

విస్తరించినా.. ఉపయోగం లేదు

శ్రీరామ్‌నగర్ ఆంజనేయ ఆలయం నుంచి మోతీనగర్ వరకు రోడ్డు వన్ వేగా విస్తరణ జరిగింది. ఇక్కడ భారీ వాహనాలు మలుపు తీసుకునేందుకు వీలుగా లేకపోవడంతో అటుగా వెళ్లడం లేదు. శ్రీరామ్‌నగర్ చౌరస్తా వద్ద ఆటోలు, ఇతర వాహనాలను పార్కు చేస్తుండడంతో మలుపు తీసుకునేందుకు వీలు కలగడం లేదు. మోతీనగర్ జైస్వాల్ ఆస్పత్రి వరకు వన్‌వే ఉన్నా వాహనదారులు అటుగా వెళ్లకుండా ఒక వైపే రాకపోకలు సాగిస్తున్నారు.

- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఉన్న సమయంలో రోనాల్డ్ రోస్, చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి రోడ్డును పరిశీలించారు. విస్తరణ పనుల్లో జాప్యంపై ఆరా తీశారు. త్వరగా పనులు జరిగేలా చూస్తామని చెప్పినా.. నేటికీ ముందడుగు పడలేదు.

బడ్జెట్ వస్తే పనులు మొదలవుతాయి



రెహ్మాత్‌నగర్ రోడ్డు విస్తరణ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో పాటు స్టాండింగ్ కమిటీలోనూ చర్చించడం జరిగింది. బాధితులకు నష్టపరిహారం అందిస్తే మలుపు వద్ద విస్తరణ పూర్తవుతుంది. బడ్జెట్ కేటాయింపు జరిగితే ఇక్కడ పనులు మొదలవుతాయి. మధురానగర్, శ్రీరామ్‌నగర్‌లో కూడ రోడ్డు విస్తరణకు కృషి చేస్తా.

\- సీఎన్ రెడ్డి, కార్పొరేటర్

అగ్నిప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


అభిషేక్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ , 31 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని శివానంద రిహాబిలిటేషన్ హోంలో 23వ తేదీ అర్ధరాత్రి ఓ క్వార్టర్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. ప్రమాద కారణాలు ఇంకా తెలియనప్పటికీ, దోమలను పారద్రోలే మస్కిటో కాయిల్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. కూకట్‌పల్లి సీఐ ముత్తుతో కలిసి ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిజియోథెరపిస్ట్ విమల క్వార్టర్స్‌లో తన తమ్ముడు అభిషేక్(27) రెండు రోజులు బస చేశాడని, తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న విమల క్వార్టర్స్‌లో 23న రాత్రి హఠాత్తుగా మంటలు చెలరేగటంతో తల్లి దీనమ్మ, తమ్ముడు అభిషేక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి, తండ్రికి ఒక మోస్తారు గాయాలవ్వగా చికిత్స పొందుతున్న బాపట్లకు చెందిన అభిషేక్ పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి కుత్బుల్లాపూర్ గ్రామ చౌరస్తా నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు మియాపూర్ నుంచి వస్తున్న బస్సు షామీర్‌పేటలోని ఫార్మా పరిశ్రమకు కార్మికులను తీసుకువెళ్తుంది మార్గమధ్యలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బస్సు ఆ వ్యక్తిని కొట్టడంతో వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు స్థానికులు పేట్ బషీబాద్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతుడి గురించి ఆరా తీశారు. అతడి వివరాలు తెలియకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు వేసుకున్నారు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హైదర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఏ సమస్యలు ఎదురైన తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాతావరణశాఖ సూచనల మేరకు అత్యవసరం అయితే తప్పా బయటకు రావొద్దని తెలిపారు. ఇబ్బందులు ఎదురైతే సబంధిత అధికారులకు గానీ తమ కార్యాలయాన్నిగానీ సంప్రదించాలన్నారు.

ఇంద్రన్నకాలనీలో ఇళ్ల కూల్చివేతపై ఆగ్రహం

నిజాంపేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ఇంద్రన్న కాలనీలో ఏళ్ల తర బడి నివాసం ఉంటూ, పట్టాలుండి, ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్న పేదలకు చెందిన 10 ఇళ్లను టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రశాంతి ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం కూల్చి వేశారు. ఈ విషయమై సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లో ఇంద్రన్న కాలనీ గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఏర్పడిందని, అప్పట్లోనే కాంగెస్ ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చిందన్నారు. బడాబాబులు అడ్డదారుల్లో అనుమతులు తెచ్చుకొని అడ్డదిడ్డంగా నిర్మించినా చర్యలు తీసుకోని అధికారులు, పేదలను రోడ్డున పడేయడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి పేదల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కత్వ చెరువు వరదనీటి కాలువను పునరుద్ధరించాలి

దుండిగల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామంలో 100 ఎకరాల్లో విస్తరించిన కత్వ చెరువు దుండిగల్, ఫారెస్ట్ ప్రాంతాల నుంచి రావాల్సిన వర్షంనీరు చెరువులోకి రానివ్వకుండా అడ్డంగా కట్ట నిర్మించారని, దీని వలన చెరువులోని నీరు రాకుండా పోతుందని, ఈ సమస్యకు మార్గం చూపించాలని మల్లంపేటకు చెందిన ఆంజనేయులు మరికొందరు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. శనివారం చెరువు ప్రాంతంలో పర్యటించిన గ్రామస్తులు కందరు వరదనీటి నాలాను పరిశీలించారు.

కిలో మీటరు పొడవునా నాలాను చెడిపేసి, చెరువులోకి నీళ్లు రాన్వికుండా కొందరు అడ్డుకట్ట వేశారని, ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించినట్లు ఆంజనేయులు తెలిపాడు. వరద నీటిని చెరువులోకి వచ్చే విధంగా నాలా లను పునఃనిర్మిస్తే, చెరువు నిండుతుందని తెలిపారు.

బీహెచ్‌ఈఎల్ ఎస్సీ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం ఎన్నిక

భెల్‌కాలనీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు శనివారం జరిగిన ఎన్నికల్లో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టౌన్‌షిప్‌లో గల కమ్యూనిటీ సెంటర్‌లో ఎన్నికలను నిర్వహించి సాయంత్రం ఫలితాన్ని ప్రకటించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా జి.సురేందర్ ఎన్నికయ్యారు. అసోసియేషన్‌కు మొత్తం 535 సభ్యులుండగా 425 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సురేందర్‌కు 298 ఓట్లు పోలవ్వగా, సమీప ప్రత్యర్థి రవికుమార్‌కు 124 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శిగా దేవార్జున్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ.. ఎస్సీ కార్మికుల హక్కులను కాపాడుతూ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

నిజాంపేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 3న ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి తెలిపారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ పార్టీ కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు నరేంద్రచౌదరి ఆధ్వర్యంలో సభ్యత్వనమోదు గురించి సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణాలో రాబోయే కాలంలో బీజేపీ అధి కారంలోకి రావడం ఖాయమని, బీజేపీ పార్టీ నాయకులు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో-కన్వీనర్, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, చంద్రమౌళి, సంతోష్‌కుమార్‌గౌడ్, అశోక్, మదన్ గౌడ్, సత్యానారాయణ, మంజూ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.